ఆక్రమణకు గురైన బుగ్గవంక



చెరువుల గతీ అంతే..

● బచ్చారాయి చెరువు సర్వే నెంబరు 22లో ఉంది. ఇది 70 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ చెరువు, కాల్వలు, అలుగు ఆక్రమణకు గురయ్యాయి.

● పుట్లంపల్లె చెరువు 139 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనికి సంబంధించిన కాల్వలు, చెరువుతట్టు భూములు ఆక్రమణకు గురయ్యాయి.

● రామయ్యచెరువు 30 ఎకరాల్లో ఉంది. ఇది ఆక్రమణకు గురైంది. బుడ్డాయపల్లె చెరువు 84 కరాల్లో ఉంది. దీనినీ ఆక్రమించారు. కాల్వలు, వాగులు కూడా ఆక్రమించారు.

● మొగలిచెరువు, బచ్చారావు చెరువులకు పాలకొండ, సుగాలితండా, మామిళ్లపల్లె, మునలిరెడ్డిపల్లె, తెలుగుగంగ రైల్వేట్రాక్ నుంచి డిగ్రీ కళాశాల మీదుగా కాల్వలు ఉన్నాయి. వర్షాకాలంలో నీరంతా ఈ ప్రాంతాల నుంచి కాల్వల ద్వారా వచ్చి చెరువులకు చేరేది. కాల్వలు సుమారు 10 మీటర్లకు పైగా వెడల్పు ఉండేవి. అవన్నీ ఆక్రమణకు గురయ్యాయి. ఏడాది కిందట కొంతమేర తొలగించినా పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరగలేదు.

● ప్రకాశ్‌నగర్‌లో చెరువు, శ్మశానాలను ఆక్రమించేసి వెంచర్ వేశారన్న ఫిర్యాదులున్నాయి. ఇక్కడ ఆక్రమణల తొలగింపునకు అధికారులు ఎందుకో ముందుకు పోవడంలేదు. సీకేదిన్నె మండలం రెడ్డిపల్లె చెరువు అలుగు కూడా ఆక్రమించారు.

● రాజీవ్‌మార్గ్‌లో ఒకప్పుడు చెరువు ఉండేది. దాన్ని దొంగలచెరువుగా పిలిచేవారు. ఇప్పుడు అక్కడ పార్కు ఉంది. ఒకప్పుడు దొంగలచెరువు నుంచి ప్రస్తుతం ఉన్న సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఆర్టీసీ బస్టాండు మీదుగా అంబేడ్కర్ సర్కిల్ నుంచి వైజంక్షన్ వరకు కాల్వ ఉండేది. వర్షం వస్తే ఈ కాల్వ గుండా నీరు మృత్యుంజయకుంట చేరేది. ఇప్పుడు ఆ కాల్వను పూర్తిగా ఆక్రమించారు. 10 నుంచి 12 మీటర్లున్న కాలువ పిల్ల కాల్వ మాదిరి జానెడు మూరెడుకే పరిమితమైంది. రికార్డుల్లో కూడా కాల్వ అని ఉంది. అయినా ఈ కాల్వలోనే ఓ వాణిజ్య సంస్థ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం దొంగల చెరువు లేకపోయినప్పటికీ వాన నీరు వెళ్లే వరద కాల్వలన్నీ ఆక్రమణకు గురై నీరంతా ఎటు పడితే అటు వెళ్లిపోతోంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆర్టీసీ బస్టాండు ఏరియా కుంటను తలపిస్తోంది.

● ఊటుకూరు చెరువు నుంచి బిల్టప్ సర్కిల్ ప్రాంతం వరకు కాల్వ ఉండేది. ఇది కూడా భారీ స్థాయిలో ఆక్రమణకు గురైంది. దీంతో ఇక్కడున్న కాలనీలు పెద్దవాన వస్తే ముంపునకు గురవుతున్నాయి.

నీటితొట్టిలా మారిన.. మృత్యుంజయకుంట

కడప నగరంలో పలు కుంటలు, చెరువులు ఉండేవి. వాటికి పంట కాల్వలతో పాటు వరదనీరు వెళ్లే పెద్దపెద్ద కాల్వలు ఉండేవి. అవన్నీ ఇప్పుడు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వర్షం నీరు వెళ్లే దారిలేదు. కాల్వలు, కుంటల స్థలాల్లో పెద్ద పెద్ద భవంతులు వెలిశాయి. కడప నగరం నడిబొడ్డున మృత్యుంజయకుంట ఉంది. ఇక్కడ దివంగత వైఎస్ హయాంలో కడప నగర అభివృద్ధిలో భాగంగా బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు డీపీఆర్ కూడా తయారైంది. బోటింగ్ సౌకర్యం ఏర్పాటుకు డీపీఆర్ తయారు చేశారంటే ఆ చెరువు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నట్టే. అయితే మృత్యుం జయకుంటను వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఆక్రమించి అమ్మేసుకున్నారు. దీంతో కుంట చిన్న నీటితొట్టిలా మారింది. వెరసి భారీ వర్షాలకు ఆ ప్రాంతం ముంపునకు గురవుతోంది.



మేలుకోకపోతే ముసకే..!

బుడమేరు వాగు విజయవాడను అతలాకుతలం చేసింది. ఆక్రమణల ఫలితంగా వరద నీరు ముంచెత్తింది. వర్షం నీరు వెళ్లే వాగులు వంకలు చెరువులు కాల్వలను ఆక్రమిస్తే ఎలా ఉంటుందో విజయవాడ వరదే సాక్ష్యం. మూడేళ్లకిందట కడప నగరం కూడా ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంది. భారీ వర్షాలకు బుగ్గవంక పరివాహక ప్రాంతమంతా జలమయమైంది. వాగులు వంకలు కాల్వలు ఆక్రమించేయడంతో వరద నీరంతా ఇళ్లల్లోకి చేరింది. అలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు కొన్నిచోట్ల ఆక్రమణలు తొలగించారు. వరద కాల్వ అంటూ హడావిడి చేసి మళ్లీ మరిచారు. విజయవాడ దుస్థితి చూశాకైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేలుకోకపోతే.. పెద్ద వాన వస్తే కడప నగరం మునగడం ఖాయం. ఏటా అక్టోబరు లేదా నవంబరులో ఇక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. సెప్టెంబరు నెల ముగుస్తున్న సమయంలో వానలు పట్టుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు 9 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. ఈ వర్షానికే కడప నగరంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఒకేరోజు 20 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిస్తే.. కడప నగరం ఏమవుతుందో కూడా తలచుకోవడానికే భయం వేస్తోంది.

● ఆక్రమణలు తొలగించకపోతే..
● బుడమేరుతో విజయవాడ దుస్థితే మనకూ
● చెరువులు, వరద కాల్వల ఆక్రమణ
● బుగ్గవంకనూ వదలని వైనం
● వెంచర్లు వేసి స్థలాన్ని కాజేసిన రియల్టర్లు



ఆక్రమణలో పుట్లంపల్లె చెరువు



సీకేదిన్నె పోలీస్‌స్టేషన్ దగ్గర బుగ్గవంకను ఆనుకుని అక్రమ వెంచర్



కాలువ ఆక్రమణకు గురికావడంతో ఎస్టీవి కాలనీలో నిలిచిన వర్షం నీరు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కడప నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఇక్కడ 4.30 లక్షల మంది జనాభా ఉన్నారు. ఏటా తుఫాన్లు వచ్చాయంటే చాలు... కడపవాసికి గుండె లబ్ డబ్ అంటుంది. మూడేళ్ల కిందట అక్టోబరు, నవంబరులో వచ్చిన తుఫాను కడపను చిగురుటాకులా వణికించేసింది. తుఫానులు వచ్చినప్పుడల్లా కడప ముంపునకు గురవుతూ వస్తోంది. ఎందుకంటే కడపలో కొందరు వరదకాల్వలు, నీటికాల్వలు, వాగులు, వంకలు ఆక్రమించారు. ఏకంగా బుగ్గవంక పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నారు. జగన్ హయాంలో వరద ముప్పు నుంచి గట్టెక్కేందుకు వరద కాల్వల నిర్మాణం చేపడు తున్నట్లు చెప్పుకొచ్చారు. సంవత్సరం క్రితం అప్పటి కమిషనర్ ప్రవీణ్‌చంద్ కడపలో ఆక్రమణలను తొలగించారు. అయితే పేదలున్న ప్రాంతాల్లోని ఆవా సాలను తొలగించారే తప్ప.. పెద్దల జోలికి వెళ్లలేదు. అనంతరం ఎన్నికలు రావ డం, ఆ కమిషనర్ బదిలీ కావడంతో.. ఆక్రమణల తొలగింపు అటకెక్కింది.

ఆపరేషన్ ఆక్రమణలు

విజయవాడ గతే మనకు పట్టకుండా ఉండాలంటే.. వెంటనే కడప నగరం చుట్టుపక్కల శివారు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, వాగులు వంకల ఆక్రమణలపై కొరడా ఝులిపించాల్సిందే. ఆపరేషన్ ఆక్రమణల పేరుతో అన్నింటినీ కూలగొడితే తప్ప కడప సురక్షితంగా ఉండదు. లేదంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో భారీ వర్షాలు కురిస్తే నగరవాసులకు నరకమే.

ఆక్రమణల తొలగింపుతో..

రామాంజనేయపురంలో వైసీపీ కార్పొరేటరు వేసిన లేఅవుట్లలో వరద కాల్వ ఉండడంతో నీటిపారుదల అధికారులు గురువారం ఎక్సకవేటర్‌తో లేఅవుట్ కాంపౌండు వద్ద తవ్వారు. కాల్వను ఆక్రమించి వెంచరు వేసి చుట్టూ కాంపౌడు నిర్మించడంతో దానిని తొలగించి యధావిధిగా వర్షం నీరు వెళ్లే విధంగా నీటిపారుదల ఏఈ వెంకట్రామయ్య చర్యలు తీసుకున్నారు. దీంతో మళ్లీ కడప నగరంలో ఉన్న ఆక్రమణల తొలగింపు వ్యవహారంపై చర్చ మొదలైంది. కావాలనే కూల్చారంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో కడపలో ఉన్న ఆక్రమణలన్నింటికీ చరమగీతం పాడితే ఈ ఆరోపణలకు ఫుల్‌స్టాప్ పడుతుంది.

బుగ్గవంకనూ వదల్లేదు..

కడప నగరంలో బుగ్గవంక కాల్వ ఉంది. తుఫానులప్పుడు ఈ వంక పొర్లడంతో దీని పరివాహక ప్రాంతాల జనం ముంపునకు గురవుతూ వచ్చారు. దీనిని నివారించేందుకు రక్షణగోడ నిర్మించారు. అయినా ముంపు తప్పలేదు. ఎందుకంటే బుగ్గవంక బాగా ఆక్రమణలకు గురైంది. సీకేదిన్నె పోలీసుస్టేషన్ సమీపం నుంచి ఎర్రముక్కపల్లె రైల్వే గేటు ప్రాంతం వరకు బుగ్గవంక ఆక్రమణకు గురైంది. కొందరు రియల్టర్లు పట్టాభూమితో పాటు బుగ్గవంక పరివాహక భూమి కూడా కలిపేసి వెంచర్లు వేశారు. పక్క సర్వేనెంబర్లను చూపించి, సర్వేనెంబర్లు మార్చివేసి భారీ స్థాయిలో ఆక్రమించారు. రెవెన్యూ రికార్డుల్లో అది బుగ్గవంక భూమి అని స్పష్టంగా ఉన్నా సుమారు 40 ఎకరాల దాకా ఆక్రమించి వెంచర్లు వేసి అమ్ముకుని రిజిస్టర్లు చేశారు. నిన్నటిదాకా రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి తిమింగలాలు ఉన్నాయి. వాటికి లెక్క ఇస్తే చాలు.. కలెక్టరేట్ అయినా అడ్డంగా రిజిస్టరు చేస్తారని పేరుండేది. అలాంటివారే బుగ్గవంక స్థలాన్నీ అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేసేశారు. ఇక్కడ ఆక్రమణలు తొలగించకుంటే కడప వాసులకు బుగ్గవంక ముప్పు తొలగదు.

కోతకు గురైన ఆర్టీపీపీ రోడ్డు మార్గం



పెన్నానదిలో భారీగా నీరు రావడంతో కోతకు గురైన ప్రొద్దుటూరు - ఆర్టీపీపీ రోడ్డు మార్గం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 26: ప్రొద్దుటూరు పెన్నానదిలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. మైలవరం జలాశయం నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో పెన్నానది జలకళను సంతరించుకుంది. పెన్నాతీరంలో ఎలాంటి ప్రమాద ఘటనలు చోటు చేసుకోకుండా రెవెన్యూ యంత్రాంగం రక్షణ చర్యలు చేపట్టింది. ఈ నదిలో పెద్ద ఎత్తున వస్తున్న ప్రవాహానికి రామేశ్వరం ఆర్టీపీపీ రోడ్డు మార్గం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సోములవారిపల్లె, ఇల్లూరు, చిన్నదండ్లూరు, కలమల, ఆర్టీపీపీకి రవాణా మార్గం బంద్ అయింది. ఈ మార్గంలో చేపట్టిన హైలెవెల్ వంతెన పనులు బిల్లులు మంజూరు కాకపోవడంతో నిలిచిపోయాయి. ఏటా ఇలా పెన్నానదికి కృష్ణా జలాలు రావడంతో ఈ మార్గం కోతకు గురై రాకపోకలు బంద్ అయి తిరిగి రోడ్డు మార్గం ఏర్పాటుకు నెలల సమయం పడుతోంది. సకాలంలో వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని స్థానికులు వాపోతున్నారు. ఈ హైలెవెల్ వంతెనను కూటమి ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చొరవ తీసుకుని నిధులు తీసుకురాగలిగితే పూర్తి చేయగలరు. లేదంటే ఈ మార్గం లో రవాణా రాకపోకలకు ఆటంకాలు తప్పవు.

రబీ ప్రణాళిక రెడీ

● సాగు అంచనా 1,42,812 హెక్టార్లు

కడప (రూరల్), సెప్టెంబరు 26: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రబీ లక్ష్య సాధనకు చర్యలు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. రబీలో 1,42,812 హెక్టార్లు సాగు అంచనా కాగా ఇందుకు 75,597 క్లింటాళ్ల విత్తనాలు, 77,100 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా భావించామన్నారు. బుడ్డశనగ విత్తనాలు 72,386 క్వింటాళ్లు, వేరుశనగ విత్తనకాయలు(కె6) 1,800, మినుము 967, పెసర 328, కందులు 15.5, కుసుమ 70, కొర్ర 18, రాగులు 4 క్వింటాళ్లు అవసరంగా భావించారు. ఈ పంటల సాగుకు 77,100 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. ఈ మేరకు యూరియా 30,230.55 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,232.61, ఎంవోపీ 2,861.31, కాంప్లెక్స్ ఎరువులు 38,146, ఎస్ఎస్‌పీ 2,628.73 మెట్రిక్ టన్నులు అవసరంగా భావించారు. ఈ మేరకు వ్యవసాయాధికారులు నివేదికలు తయారు చేశారు. రబీ సీజన్ మరో 4 రోజుల్లో ప్రారంభ కానుంది. నైరుతి రుతుపవనాలు 10 రోజులు ముందుగానే నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రబీసాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ వైపు అన్నదాతలు ఇప్పటికే వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా మరోపక్క అధికారులు సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు అందించే పనిలో బిజీబిజీగా ఉంటున్నారు.

ఉచిత న్యాయసహాయానికి టోల్‌ఫ్రీ నెంబర్

కడప (రూరల్), సెప్టెంబరు 26: ఉచిత న్యాయసహాయానికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నెంబర్ 15100 తీసుకొచ్చిందని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే పలు కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రజలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నామన్నారు. న్యాయసేవలను మరింతగా సులభతరం చేయాలనే ఉద్దేశ్యంతో టోల్‌ఫ్రీ నెంబర్ తీసుకొచ్చామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని తగు న్యాయసహాయం పొందాలన్నారు. కాగా.. రిమ్స్‌ను గురువారం డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ విజిట్ చేశారు. పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ నేరాలను కట్టడి చేస్తాం..

● డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జయరాజ్

కడప (క్రైం), సెప్టెంబరు 26: ఎక్సైజ్ నేరాలను కట్టడి చేస్తామని, ఉమ్మడి జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యాన్ని నిర్మూలించేందుకు చర్యలు చేపడతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజ్ అన్నారు. ఆయన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో అక్రమ మద్యాన్ని కట్టడి చేసేందుకు నిఘా ఉంచుతామన్నారు. నాటుసారా, బెల్టు షాపులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. 1996 బ్యాచ్‌కి చెందిన ఈయన రాష్ట్రంలో పలు ఎక్సైజ్ స్టేషన్లలో సీఐగా పనిచేశారు. 2023లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది విశాఖపట్టణంలో పనిచేస్తూ కడప జిల్లాకు బదిలీపై వచ్చారు.



గండికోటలో పర్యాటక సంబరం

● ఏర్పాట్లు చేసిన అధికారులు
● నేడు పర్యాటక దినోత్సవం



సొరంగం ద్వారా గండికోట ప్రాజెక్టులోకి వస్తున్న కృష్ణాజలాలు



కొండల మధ్య గండికోట ప్రాజెక్టు


జమ్మలమడుగు/కొండాపురం/కడప (కల్చరల్), సెప్టెంబరు 26: గండికోటలో పర్యాటక ఉత్సవాలకు జిల్లా, స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు గండికోటలో పర్యాటక ఉత్సవాలు (పర్యాటక దినోత్సవం)నిర్వహించనున్నారు. ఇక్కడ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ముందుగా గుర్రపుశాల, వాటర్‌ట్యాంకు తదితర ప్రాంతాలను శుభ్రం చేసి సమావేశానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పోలీసు అధికారులు, పర్యాటక శాఖ జిల్లా, స్థానిక అధికారులు, సర్పంచ్ ఈశ్వర్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు గండికోటకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో గండికోటకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజియన్ పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి తెలిపారు. అందులో భాగంగా కడప డిపో నుంచి ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 12గంటలకు ప్రత్యేక బస్సులు గండికోటకు వెళతాయన్నారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7-30 గంటలకు గండికోట నుంచి కడపకు బస్సులు బయలుదేరుతాయన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి గండికోటకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ప్రతీ గంటకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు.

గండికోట ప్రాజెక్టుకు పర్యాటక శోభ ఏదీ

జిల్లాకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. 26.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టు కృష్ణాజలాలతో కళకళలాడుతూ దర్శనమిస్తోంది. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా గండికోటలోకి కృష్ణాజలాలు వచ్చేందుకు మైలవరం మండలం లింగాపురం నుంచి గండికోట ప్రాజెక్టు వరకు 5.5 కిలోమీటర్లు సొరంగాన్ని నిర్మించారు. ఈ సొరంగం ద్వారా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చేటప్పుడు పర్యాటకులను ఆకట్టుకుంటుంది. 22 గ్రామాలు ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతంలో బ్యాక్‌వాటర్‌తో కృష్ణాజలాలు కనువిందుచేస్తాయి. ఈ జలాశయం చుట్టూ కొండల మధ్య చూడటానికి ఆహ్లాదకరంగా ఉంటుంది. గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే బోటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే మైలవరం జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసినా దానికంటే పెద్దదైన గండికోట ప్రాజెక్టులో ఇంతవరకు బోటింగ్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. గండికోట ప్రాజెక్టు ప్రాంతంలో రిసార్ట్‌లు, వెనుకజలాల్లో బోటింగ్ సౌకర్యం, వ్యూపాయింట్లు వంటివి ఏర్పాటుచేసేందుకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సి ఉంది.



కృష్ణాజలాలతో కనువిందు చేస్తున్న గండికోట బ్యాక్‌వాటర్



గండికోటలో పర్యాటక ఉత్సవాలకు చేసిన ఏర్పాట్లు

ఇలా వచ్చి.. అలా వెళుతున్నారు

- బదిలీల పేరుతో విధులకు డుమ్మా
- 15 రోజులుగా ఇదే తంతు
- ఇదీ రాయచోటి మున్సిపాలిటీలో ఉద్యోగుల తీరు

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 26: రాయచోటి మున్సిపాలిటీలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు 15 రోజులుగా విధులకు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారని తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత నెల 18 నుంచి బదిలీలకు పచ్చజెండా ఊపింది. అయితే విజయవాడలో ఫ్లడ్స్ (వరదలు)వచ్చిన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిని విజయవాడకు పంపడంలో భాగంగా రాయచోటి మున్సిపల్ కమిషనర్ కొందరిని అక్కడికి పంపారు. ఇదే అదునుగా మిగిలిన కొందరు ఉద్యోగులు కనీస బాధ్యత మరచి విధులకు డుమ్మాకొడుతూ ఇతరపనుల్లో బిజీగా వున్నారని తెలిసింది. ఈనెల 15వ తేదీకి బదిలీల ప్రక్రియ ముగియాల్సి ఉంది. ఇదిలా వుండగా బదిలీల విషయంలో ప్రభుత్వం ఈ నెల ఆఖరు వరకు అవకాశం ఇస్తూ జీఓను విడుదల చేసింది. దీంతో ఉద్యోగులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ విధులకు ఎగనామం పెడుతున్నారని తెలిసింది.

విజయవాడ ఘటనపై కమిషనర్ అక్కడకు వెళ్లినప్పుడు మున్సిపల్ ఉద్యోగులు కాలక్షేపం కోసం అలా వచ్చి కాసేపు ఫేస్‌బుక్‌లు చూసుకుని వెళ్లేవారని కింది స్థాయి సిబ్బంది చెప్పుకొస్తున్నారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, పరిపాలన విభాగంలో పనిచేసే ఉద్యోగులు బదిలీల పేరుతో అసలు ఆఫీసుకు రావడం మరచిపోయారని వాదన బలంగా వినపడుతోంది. దీంతో ఇంటి పన్నులు, టౌన్ ప్లానింగ్ అనుమతులు తదితర పనులు నిమిత్తం వచ్చేవారు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని తెలిసింది. స్పెషల్ అప్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినప్పటి నుంచి ఏదైనా పని నిమిత్తం వచ్చే వారికి సచివాలయానికి వెళ్లండంటూ ఉచిత సలహాలు ఇస్తూ తమకేమి సంబంధం లేదన్నట్లు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక ఉద్యోగులకు బదిలీలు వచ్చినా.. రిలీవర్ వచ్చేంత వరకూ ప్రజలకు సేవలు అందించాల్సి వుంటుంది. ఇక్కడ అలాంటి నిబంధనలు ఏవీ పాటించకుండా ఎప్పుడు పడితే విధులకు రావడం, నచ్చినప్పుడు వచ్చి సీట్లో కూర్చోవడం.. లేదా ఏదోక కుంటిసాకుతో ఆఫీసు వదలి వెళ్లడం.. నిరంతరం జరిగే ప్రక్రియ అని చెప్పవచ్చు.



రాయచోటి మున్సిపల్ కార్యాలయం

కమిషనర్ ఈ రోజు డ్యూటీకి రాడని తెలిస్తే చాలు ఉద్యోగులు కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడరనే ఆరోపణలు బలంగా వున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రాయచోటి మున్సిపాలిటీ ఉద్యోగుల ఆగడాలకు కళ్లెం వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారులపై విమర్శలు వున్నాయి

రాయచోటి మున్సిపల్ ఉద్యోగులపై చాలా విమర్శలు వున్నాయి. సచివాలయాలు వచ్చాక వీరు బద్దకస్థులుగా మారారని.. ఆరోపణలు ఉన్నాయి. వీరిలో కొందరు అధికారులు సచివాలయ సిబ్బంది ద్వారా మామూళ్లు తీసుకుంటూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు తమకు తెలియనట్లు నటిస్తూ.. కమిషనర్ వద్ద నిజాయితీ పరులుగా ఫోజులు ఇస్తుంటారని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. జిల్లా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో వీరు ఇలా తయారయ్యారనే వాదన వుంది.

-సిద్దిగాళ్ల శ్రీనివాసులు,
సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, అన్నమయ్య జిల్లా

చర్యలు తీసుకుంటాం..

నేను విజయవాడకు వెళ్లినప్పుడు ఇక్కడ ఎమి జరుగుతోందనే విషయం నాకు తెలియదు. విధులకు ఎవరు సక్రమంగా రావడం లేదో విచారిస్తాను. ఇంకోసారి ఇలా జరగకుండా చర్యలు కఠినంగా తీసుకుంటాం.

-వాసుబాబు,
మున్సిపల్ కమిషనర్, రాయచోటి

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



పశువైద్య కళాశాలలో విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: గోపవరంలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ అడ్మిషన్లు ఇచ్చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆన్‌లైన్ ద్వారా 60 మంది విద్యార్థులకు మొదటి సంవత్సరంలో చేరడానికి అవకాశం కలిగిందన్నారు. వారిలో 15 మంది వీసీఐ కోటా ద్వారా ఎంపికయ్యారని తెలిపారు. 28వ తేదీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఉంటుందని, 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైద్యులు పాల్గొన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 26: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం జలాశయం నుంచి 4500 క్యూసెక్కుల నీటిని పెన్నానదికి వదులుతుండగా... గండికోట జలాశయం నుంచి 5వేల క్యూసెక్కుల నీరు మైలవరానికి చేరుతోంది. ఉత్తరకాల్వకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 200 క్యూసె క్కుల నీటిని వదులుతున్నామని జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. గండికోట జలాశయం నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పెన్నానదికి వదులుతామని.. పరివాహకప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.7 టీఎంసీలు నిల్వ ఉంది.

29న కడపలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 26: కడప నగర పరిధిలో గల (దండు- ఆలంఖాన్‌పల్లె) విస్డమ్ స్కూల్‌లో ఈనెల 29వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. ఇందులో విజేతగా నిలిచిన క్రీడాకారుడికి రూ.30 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, మెడల్స్ కూడా ఇస్తారన్నారు. టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా ప్రముఖ ఎఫ్ఐడీఈ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్ (గుంటూరు), డిప్యూటీ ఆర్బిటర్‌గా సీనియర్ నేషనల్ ఆర్బిటర్ రామ్, వంశీ (నెల్లూరు) విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు ముఖ్య అతిథులుగా ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణరావు, కార్యదర్శి వై.సుమన్ హాజరుకానున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇతర వివరాలకు 8341255151 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్టోబరు 4న స్కిల్ కోచ్ పరీక్ష

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సులు రెండో సెమిస్టరు చదువుతున్న విద్యార్థులకు అక్టోబరు 4న స్కిల్ కోర్సు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటలకు ఉం టుందని.. ఈ సమాచారం అన్ని కళాశాలల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సయ్యద్ అహందుల్లయ్య (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 26: మైదుకూరు బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ అహందుల్లయ్య (39) అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకెళితే... తెలంగాణ రాష్ట్రం బాన్సువాడ మండలం వాసి అహందుల్లయ్య బైక్‌లో కడప వైపు ప్రయాణిస్తుండగా మైదుకూరు బైపాస్ వద్ద అదుపు తప్పి రోడ్డు రోలర్‌ను ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతోనే అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రొద్దు టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం



పుల్లంపేట, సెప్టెంబరు 26: పుల్లంపేట మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న దినేష్(28) బుధవారం విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గతనెల 15న దినేష్ విజయవాడకు చెందిన యువతి జోష్ణవితో పుల్లంపేటలో వివాహమైంది. రెండు రోజుల క్రితం దినేష్ తన భార్యతో కలిసి అత్తగారి ఇల్లు అయిన విజయవాడకు వెళ్లాడు. బుధవారం రాత్రి ఇంటి నుంచి మోటారుబైకులో బయలుదేరిన దినేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లికుమార్తె కాళ్లపారాణి ఆరకముందే వివాహమైన నెలన్నరకే దినేష్ మృతిచెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

నన్నారి ఫ్యాక్టరీలో చోరీ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 26: పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో గంగిరెడ్డి ఫ్యాక్టరీలో బాషా అనే వ్యక్తి నన్నారి ఫ్యాక్టరీ నడుపుతున్నాడు, గురువారం ఫ్యాక్టరీలో దొంగలు పడి 8 సిలిండర్లు, వెల్డింగు మిషన్‌తో పాటు మూడు మోటర్లను దొంగలించినట్లు బాధితుడు బాషా తెలిపారు. వీటి విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండడంతో పులివెందుల పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన పడుతున్నారు. పోలీసు అధికారులు చోరీలను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుర్తు తెలియని శవం



ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26: మండల పరిధిలోని కొర్లకుంట పరిసరాల్లో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. కొర్లకుంట గ్రామం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని రైల్వేబ్రిడ్జి దగ్గర గుర్తు తెలియని మగ శవం పడి ఉంది. ఆచూకీ తెలిసినవారు సమాచారం ఇవ్వాలన్నారు. 9121100580 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు.

సమాజ అవసరాలు తీర్చేలా విద్యావిధానం : వీసీ



మాట్లాడుతున్న రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: సమాజ అవసరాలు తీర్చేలా విద్యార్థుల్లో నైపుణ్యత పెంచే దిశగా విద్యాలయాలు ప్రయత్నాలు ప్రారంభించాలని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్శిటీ అన్నమాచార్య సెనెట్‌హాలులో ఉన్నత విద్య ప్రయోజనాలు వ్యూహాలు, సవాళ్లు, నైపుణ్యత ఆధారిత పాఠ్యాంశాలు అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాపును రిజిస్ట్రారు రఘునాధరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో మార్కులు ప్రామాణికం కాదని, నైపుణ్యత ముఖ్యమన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా ప్రయోగాత్మక విద్యాబోధన అమల్లోకి రానుందని.. నాలుగేళ్ల హానర్స్ కోర్సు సత్ఫలితాలు ఇస్తుందన్నారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాధరెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిష్కృతమైనా నైపుణ్యత లేని యువత వల్ల దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 47శాతం మంది విద్యార్థులు మాత్రం సరైన నైపుణ్యత కలిగి ఉన్నారన్నారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఏపీ 2020 విద్యారంగంలో ఒక మైలురాయి అని తెలిపారు. ఈ విధానం ఎన్నో విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతి ఐఐటీ ప్రొఫెసరు సునీల్‌కుమార్, వెల్లూరు వీఐటి ప్రొఫెసరు ఎస్ఎం ఫరూక్, కన్వీనర్లు ప్రొఫెసరు లలితలు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసరు సరిత, అసోసియేట్ ప్రొఫెసరు సునీతతో పాటు పలువురు పాల్గొన్నారు.

200ఎకరాలకు పైబడి దెబ్బతిన్న ఉల్లి, పత్తిపంటలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 26: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన ఉల్లి, పత్తి పంటలు వర్షం పాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలంలోని కొమ్మద్ది గ్రామంలో బోరుబావుల కింద దాదాపు 200 ఎకరాల్లో సాగుచేసిన ఉల్లి, పత్తి పంటలు వర్షంతో దెబ్బతిన్నాయి. బుధవారం రాత్రి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన దాదాపు 50 మంది రైతులు సాగు చేసిన సుమారు 200 ఎకరాలకు పైబడి ఉల్లి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఉల్లి సాగు చేసేందుకు ఎకరాకు రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఖర్చు అయ్యిందని, ఉల్లిగడ్డలు కూలీలతో పీకించి పొలం మీదనే ఆరబెట్టామని.. అంతలోపే వర్షం కురవడంతో పంట అంతా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను జిల్లా అధికారులు పరిశీలించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



కొమ్మద్ది గ్రామంలో తడిచిపోయిన ఉల్లిగడ్డలు

చికిత్స పొందుతూ పూజారి మృతి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: దత్తాత్రేయ స్వామి ఆలయం ప్రధాన పూజారి వీణా రామానుజాచార్యులు (58) చికిత్స పొందు తూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. గత శుక్రవారం ఆయన విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబీ కులు చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స తర్వాత ఇంటికి తీసుకొచ్చారు. గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆలయ ఈఓ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆయన భార్య తీర్థపాటి పుష్ప ఈఓ సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని, తాము ఉంటున్న ఇంటికి బాడుగ వసూలు చేస్తుండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరిగేషన్‌లో ఈఈల బదిలీలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: కడప జీఎన్ఎస్ఎస్ ఈఈగా సుబ్రమణ్యం మంజుల బదిలీపై వచ్చారు. కడప ఇరిగేషన్ ఈఈగా పనిచేస్తున్న శేషబాబు బద్వేలు తెలుగు గంగ ప్రాజెక్టు ఈఈగా బదిలీ అయ్యారు. అలాగే కడప ఇరిగేషన్ ఈఈగా మధుప్రసాద్‌రెడ్డి సుబ్రమణ్యం బదిలీపై వచ్చారు.

కడప కార్పొరేషన్ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: కడప మునిసిపల్ కార్పొ రేషన్ కమిషనర్‌గా నిమ్మనపల్లె మనో జ్‌రెడ్డిని నియమిస్తూ గురు వారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసా ద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ కమి షనర్‌గా ఉన్న వైఓ నందన్ చీఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఎన్.మనోజ్‌రెడ్డి పలమనేరు ఆర్డీవోగా ఉన్నారు. గురువారం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఈయనను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. తిరిగి కొన్ని గంటల వ్యవధిలోనే కడప మున్సిపల్ కార్పొ రేషన్ కమిషనర్‌గా నియమించారు. ఈయన 2022 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారి. గత ఏడాది నవంబర్‌లో పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కడప కమిషనర్‌గా వస్తున్నారు.

బాలగొండ గంగాధర్‌కు పర్యాటక ఎక్సలెన్స్‌అవార్డు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : కడప నగరానికి చెందిన చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్‌కు 2024కు సంవత్సరానికి రాష్ట్ర పర్యాటకశాఖ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. పర్యాటకంపై రాష్ట్రస్థాయిలో ప్రస్తుత స్థితిగతు లు, ఆర్థిక సామాజిక ప్రభావం తదితర అంశాలపై ఆయన జాతీయస్థాయిలో ప్రచురించిన పత్రాలు పుస్తకాలకు ఈ బహుమతి లభించింది. గంగాధర్ జిల్లా పర్యాటక సంస్థలకు సుపరిచితుడు. సుబ్బిరెడ్డి డిగ్రీకళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కూడా అధ్యాపకులుగా సేవలందించారు. గంగాధర్ ప్రస్తుతం వేంపల్లె డిగ్రీకళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



అట్లూరు, సెప్టెంబరు 26: అట్లూరు కేజీబీవీ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. 23న తిరు పతిలో జరిగిన జూడో జాతీయ స్థాయి టోర్న మెంటులో యక్ష రెండో స్థానం దక్కించుకుందని కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన జిల్లాస్థాయి కుస్తీ పోటీలకు అండర్-14 విభాగంలో గోపిక, తనూజా, కీర్తన, హిమ, శైలజ విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ ప్రమీల తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు



సుండుపల్లె, సెప్టెంబరు 26: సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం కడప జిల్లాలోని గండి గురుకుల పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల కోసం ఉమ్మడి కడప జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో సుండుపల్లె ఉన్నత పాఠశాల నుంచి అండర్-17 బాలికల విభాగం ఎం.వాణి, అండర్-14 విభాగంలో సి.గగన, అర్పిష, ఆఫీఫా, నవ్యలతలు ప్రతిభ చాటడంతో ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహదేవపల్లె విద్యార్థిని

చక్రాయపేట, సెప్టెంబరు 26: ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు మహదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేకల బిందు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పిడి ఓబులేసు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని బిందును, పిడిలను విద్యావేత్త వెంకటప్రసాద్, గ్రామ టీడీపీఇన్‌చార్జిరమేష్‌లు అభినందించారు.

శిశువు మృతి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

వేంపల్లె, సెప్టెంబరు 26: మండలంలోని పాములూరు గుట్ట ప్రాంతంలో గుర్తుతెలియని మూడు రోజుల శిశువు మృతి కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. 2016లో జరిగిన ఈ ఘటనపై వీఆర్వో సునీల్ ఫిర్యాదు మేరకు పులివెందులకు చెందిన బత్తిన మల్లీశ్వరి, బత్తల చిన్నపై ఎస్ఐ మదుమల్లేశ్వర రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరిపారు. గురువారం నిందితులు మల్లీశ్వరికి ఏడాది జైలు, రూ.1000 జరిమానా, చిన్నకు మూడేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఖజానాకు కన్నం..!



- రాజంపేట సబ్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో చోరీ
- రూ.11,500 నగదు, 20 తులాల బంగారు మాయం?
- ఇంత వరకు కేసు నమోదు కాని వైనం

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 26: ఇళ్లకు దొంగలు కన్నాలు వేయడం చూశాము. బ్యాంకులు చివరికి ఏటీఎంలకు కన్నాలు వేసే ఘటనలు చూస్తుంటాం. 24 గంటల పోలీసు భద్రత నడుమ ఉండే ఖజానా శాఖ స్ట్రాంగ్ రూములకు కన్నాలు వేసే దొంగల బాగోతం తాజాగా ఉమ్మడి కడప జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. పకడ్బందీగా, కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే ఖజానా స్ట్రాంగ్ రూములో చోరీ జరగడం అసాధ్యమే. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ తాజాగా అన్నమయ్య జిల్లా ఖజానా శాఖ పరిధిలోని రాజంపేట సబ్ డివిజన్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో రూ.11.500 నగదు, 20 తులాల బంగారు మాయం అయినట్లు ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. ఈ చోరీ జరిగి వారం రోజులు కావస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం చూస్తే కంచే చేను మేసిందా? అనే సందేహాలు ఆశాఖ ఉద్యోగుల్లో వ్యక్త మవుతున్నాయి. వివరాలిలా..

రాజంపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఒక సబ్ ట్రెజరీ అధికారితో పాటు ఇద్దరు అటెండర్లు, 8 మంది సీనియర్ అసిస్టెంట్లు, 1 షరాబు పనిచేస్తున్నారు. ఏదైనా ఎలక్షన్ డబ్బు కానీ, వెండి బంగారు, ఖరీదైన వస్తువులు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే ఖజానా శాఖ పరిధిలోని స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తారు. ఆ సొమ్ముకు సంబంధించి బిల్లులు, ఇతర ఆధారాలు చూపితే తిరిగి చెల్లించేందుకు వీలుంటుంది. అన్ని ఆధారాలు పరిశీలించిన మీదటే చివరికి సబ్‌ట్రెజరీ అధికారి, అసిస్టెంట్ అధికారి సంతకాలతో కూడిన పత్రాలుండాలి. గేట్ ఎంట్రీ పాస్, బుక్‌లో నమోదు, లోపలికి ఎంతమంది వెళ్లారు? మళ్లీ బయటకు వచ్చారా? లేదా అనే విషయాలపై పూర్తి పోలీసు నిఘా ఉంటుంది. ఇంత జరిగితే కానీ స్ట్రాంగ్ రూములోని వస్తువు బయటకు రాదు. రాజంపేట సబ్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో రూ.11,500 నగదు, దాదాపు 20 తులాల బంగారు ఐరన్ బాక్సులో పెట్టి భద్రపరిచి సీల్ వేశారు. వీటికి సంబంధించి తగిన ఆధారాలు ఉండడంతో నగదు రికవరీ కోసం పోలీసు వచ్చాడు. నగదు, నగలు అక్కడ లేకపోవడంతో ఆయన అవాక్కయ్యారు. అయితే ఈ విషయాన్ని అధికారులు బయటకు పొక్కనివ్వలేదు. రికవరీ సొమ్ము మాయం కావడంతో ఎక్కడ ఇబ్బందులు వస్తాయో అని ఆ సబ్ ట్రెజరీ అధికారి మొయినుద్దీన్ తన సొంత డబ్బులతో సర్దుబాటు చేసినట్లు ఆ శాఖలో ప్రచారం సాగుతోంది. సీల్డ్ బాక్సులో భద్రపరిచిన నగదు, బంగారు మాత్రమే చోరీకి గురయ్యాయా.. లేక ఇంకేమైనా సొమ్ము లు పోయాయా? అనే విషయాలు తెలియలేదు. ప్రభుత్వ ఖజానా స్ట్రాంగ్ రూముకే కన్నంవేసిన ఉద్యోగులను ఆ అధికారి కాపాడడడంలో అంతర్యం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ విషయమై ఉమ్మడి కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర రావును వివరణ కోరగా అది తన పరిధి కాదని, అన్నమయ్య జిల్లా డీటీఏఓను సంప్రదించాలని సూచించారు. అన్నమయ్య జిల్లా ఖజానాశాఖ సహాయ సంచాలకులు మహబూబ్ బాషాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

సీకేదిన్నె, సెప్టెంబరు 26: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె గ్రామ సచివాలయం వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది చాలా మంచి ప్రభుత్వం ఎందుకంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నప్పటికి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.2,150 వేల కోట్లు మంజూరు చేయించారన్నారు. అలాగే స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించుకుని అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ మండల ఇన్‌చార్జి క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, వెంకటసుబ్బయ్య, డీవీ, మహేంద్ర, సుబ్బారెడ్డి, రాజా, జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాష, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, రమాదేవి, వివిధ అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

చక్రాయపేట, సెప్టెంబరు 26: 'ఇది మాటల ప్రభుత్వం కాదు.. చంద్రబాబునాయుడి చేతల ప్రభుత్వమని పులివెందులనియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బీటెక్‌రవి) పేర్కొన్నారు. గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మారెళ్లమడక గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీటెక్ రవి, టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ తప్పక నెరవేర్చుతారన్నారు. మహిళలకు బస్సు ప్రయాణం సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్నామని, త్వరలో అమలు చేస్తామన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలానికి సాగు, తాగునీటి కొరత ఉందని, రూ.200కోట్లు ఖర్చు చేసి ప్రతి చెరువుకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో చిన్నచిన్న సమస్యలున్నాయని, ఆ సమస్యలను పరిష్కరించి అందరినీ ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సోమశేఖర్, తహసీల్దార్ విజయకుమారి, టీడీపీ జిల్లా అధికారప్రతినిధి పట్టెం అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి, జనసేన అధ్యక్షుడు నాగమల్లయ్య, రంగసముద్రం శంకర్‌రెడ్డి, జి.ప్రసాద్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డిపాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఇటీవల గువ్వలచెరువు ఘాట్‌లో చక్రాయపేట మండలం కొండుగారిపల్లెకు చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో వారి కుటుంబాలను గురువారం బీటెక్ రవి, టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.50వేల చొప్పున నగదు పంపిణీ చేశారు. వారి కుటుంబాల్లో ఉద్యోగం, చదువులకు తోడ్పడతామని భరోసా ఇచ్చారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు పాలన

వేముల, సెప్టెంబరు 26: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన కొనసాగిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్లపార్థసారధిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మీదిపెంట్ల సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అన్ని హామీలను నెరవేర్చుతారన్నారు. పింఛన్లపెంపు, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, పోలవరం, అమరావతికి కేంద్రం నుంచి నిధులు తెప్పించారన్నారు. వరద బాధితులకు భరోసా ఇచ్చిన తీరును వివరించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.





సీకేదిన్నె: ఇది మంచి ప్రభుత్వం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి.. చక్రాయపేట: కార్యక్రమంలో మాట్లాడుతున్న బీటెక్ రవి.. వేములలో 'ఇది మంచి ప్రభుత్వం'

నగర పరిశుభ్రతకు సహకరిద్దాం : కమిషనర్



కార్పొరేషన్ ఆవరణంలో శుభ్రం చేస్తున్న కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : కడప నగరం పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని, ఇందుకు అందరం సమష్టిగా కృషి చేద్దాం అని మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్ పిలుపునిచ్చారు. గురువారం కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా అన్ని సెక్షన్లతో పాటు కార్యాలయ పరిసరాలను కూడా శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా కళాశాలలో పలు సర్టిఫికెట్ కోర్సులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : పలు అంశాలతో పాటు అదనపు విజ్ఞానం కలిగించడం కోసం 30 రోజుల సర్టిఫికెట్ కోర్సులను కూడా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటరు సైన్స్, కంప్యూటరు అప్లికేషన్ విభాగాల ఆధ్వర్యంలో బేసిక్ ఆటోమెషిన్ స్కిల్‌ఆఫ్ ఎంఎస్ ఆఫీసు అనే అంశంపై 30 రోజుల కోర్సును పూర్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంజులదేవి, రమ్య, గీత, మాధురి, లావణ్య, సుభాషిణి, శివాణి తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత తిల తర్పణ'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ప్రతినిధులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 26: మహాలయ పక్ష అమావాస్య సందర్భంగా పుష్పగిరి క్షేత్రంలో ఈనెల 29న సామూహిక ఉచిత తిల తర్పణ కార్యక్రమం ఉంటుందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం స్థానిక కో ఆపరేటివ్ కాలనీ సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రమౌళిశర్మ, జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణశర్మ, కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ మాట్లాడారు. వివరాలకు 9866178032 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

సీకేదిన్నె, సెప్టెంబరు 26: టీడీపీ నేత వీరకుమార్‌రెడ్డి (ఆర్‌ఎస్ బ్రదర్స్) తండ్రి రాఘవరెడ్డి గుండె పోటు(75) మృతిచెందడంతో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బొగ్గులపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు వీరకుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, పుత్తా లక్ష్మీరెడ్డి, టీడీపీ నేతలు, కార్యకర్తలు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి: ఏఐటీయూసీ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 26 : పెరుగుతున్న నిత్యావసరధరలకు అనుగుణంగా సివిల్ సప్లైలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, ఎగుమతులు దిగుమతలుకు క్వింటాకు రూ.35 ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం కడపలో మార్కెట్ యార్డులోని సివిల్ సప్లై గోదాం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరమణ, ప్రతాప్ రాజశేఖర్, నాగన్న, రామ్మోహన్ పాల్గొన్నారు.

రికార్డులు సరిగా లేకుంటే జరిమానా : సీఐ

చెన్నూరు, సెప్టెంబరు 26 :వాహనదారుల రికార్డులు సక్రమంగా లేకుంటే జరిమానా తప్పదని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. గురువారం సాయంత్రం చెన్నూరు హైవేపై రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనాల్లో ఒకరు ఇద్దరికి మించి వెళ్లరాదన్నారు.

'చేనేత కార్మికుల నిరసనకు తరలిరండి'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 26: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30 కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లాలోని చేనేత కార్మికులు అందరూ తరలిరావాలని చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

కడప(క్రైం), సెప్టెంబరు 26: కడప నగరం నబీకోటకు చెందిన భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... నబీకోటకు చెందిన లక్ష్మీదేవి, శ్రీనివాసులు చీటీల వ్యాపారం చేసేవారు. ఈ నేపథ్యంలో సుబ్రమణ్యం అనే వ్యక్తికి ఈ చీటి డబ్బు రూ.5 ఇవ్వాల్సి ఉండగా ఆయనకు ఇవ్వకుండా చేతులెత్తాశారు. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున్న సానె రాహుల్, హరినాథ్

చక్రాయపేట,సెప్టెంబరు 26:విజయవాడలోని రాష్ట్రసచివాలయంలో విజయవాడ వరదబాధితుల సహాయార్థం సానె రాహుల్, అంగల్లుశెట్టి హరినాథ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రూ.3 లక్షల చెక్కులు అందించారు. అన్నక్యాంటీన్‌లకు లక్ష రూపాయలు, ఎన్టీఆర్ ట్రస్టుకు లక్షరూపాయలు, వరద బాధితులకు లక్ష రూపాయల చెక్కులను అందించారు. అనంతరం సానెరాహుల్ చక్రాయపేట మండలంలోని సమస్యలనుచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అంగల్లుశెట్టి హ రినాథ్, సానెరాహుల్ చంద్రబాబునాయుడుతో ఉన్న సాన్నిహిత్యాన్ని మాట్లాడుకున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : సీకేదిన్నె మండలం అంగడివీధి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో పాఠశాల మొదటి ర్యాంకు సాధించిన దస్తగిరమ్మకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు సుదర్శనరెడ్డి రూ.5116లు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శనబాబు, ఉపేంద్ర, అంజీరప్ప, మాధవీ పాల్గొన్నారు.

'ఆ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : కడప నగరంలో ఇంటర్ విద్యార్థిని మార్కులు తక్కువ వచ్చాయని కొట్టిన లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిరానందన్, చంద్ర డిమాండ్ చేశారు. గురువారం ధర్నా నిర్వహించారు. అశోక్, పహద్, రాజేశ్, గణేశ్‌ప్రశాంత్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వైసీపీ నేతల ఫిర్యాదు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: కడప నగరం రామాంజనేయపురంలో ఇరిగేషన్ అధికారులు కూల్చివేతలపై కలెక్టరు శివశంకర్‌కు వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మేయరు సురేశ్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ బాలాజీ డెవలపర్స్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవితాలను మార్చగలిగే శక్తి భగవద్గీతకు ఉంది

కడప (కల్చరల్), సెప్టెంబరు 26: జీవితాలను మార్చగలిగే శక్తి భగవద్గీతకు ఉందని ఆధ్యాత్మిక ప్రసంగీకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం విశ్వనాథపురం శివాలయంలో 'ఆధునిక కాలానికి భగవద్గీత' ఆవశ్యకత అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శివాలయం అర్చకులు శ్రీకాంత్‌స్వామి, పలువురు విశ్వనాథపురం భక్తులు పాల్గొన్నారు.

గుర్రం గుంపు డ్యాంను నీటితో నింపండి

సీకేదిన్నె, సెప్టెంబరు 26 : గుర్రం గుంపు డ్యాంను నీటితో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డికి వినతి పత్రం అందించారు. కొలుములపల్లె గ్రామ సభలో ఏపీ రైతు సంఘం సభ్యులు గురువారం ఎమ్మెల్యేను కలిసి గాలేరు నగరి ప్రాజెక్టు నిధులు కేటాయించి పూర్తి చేసి రైతుల నీటి కొరత తీర్చాలన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

కడప (కల్చరల్), సెప్టెంబరు 26: మోచంపేట వద్ద గల హజ్రత్ రాఖీబ్ షా వలి బాబా ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గంధం ఉత్సవంలో చాందిని ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ మైనార్టీ నాయకుడు అమీర్‌బాబు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రేపు ర్యాబిస్ వ్యాక్సినేషన్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : ప్రపంచ ర్యాబిస్ డేను పురస్కరించుకుని ఈ నెల 28న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనరు నందన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శారదమ్మ తెలిపారు. గురువారం కార్పొరేషన్ కమిషనరు చాంబరులో ర్యాబిస్ వ్యాధి నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రంగస్వామి, డాక్టర్ స్పర్ధ, డాక్టర్ అనుపమ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తిలోనే ఉంచాలి

● సీఎంకు కడప ఎమ్మెల్యే మాధవి వినతి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటరును కొప్పర్తిలో ఉంచాలని కడప ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కోరారు. సీఎం చంద్రబాబు ను కలిసి వినతిపత్రం అందించారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటరును అమరావతికి తరలించకుండా కొప్పర్తిలోనే కొనసాగించాలని కోరారు. అనేక పరిశ్రమలు కడపకు తేవాలని పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించాలని కోరామన్నారు. కడపలో సమస్యలపై చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

ఆర్సీపీ ఆధ్వర్యంలో...

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 26 : ఎంఎస్ఎం ఈ టెక్నాలజీ సెంటరును కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం నుంచి తరలిస్తూ తెచ్చిన జీఓ 56ను రద్దు చేయాలని ఆర్సీపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో...

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : ఎంఎస్ఎంఈ సెంటరును అమరావతికి తరలించడానికి విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనచేస్తామని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 26: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. గురువారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో సోషల్ యాక్టివిటీస్ ఫర్‌రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సార్డ్స్) గ్రామాలయ సంయుక్త ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా హైజీన్ కార్నర్ ఏర్పాటు చేయగా కమిషనర్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, డిబిఎస్‌ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణువర్దన్, వలంటీర్లు రహమతున్నిష, ఈశ్వరయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార కల్తీ గుర్తింపుపై అవగాహన

పులివెందుల రూరల్, సెప్టెంబరు 26: ఆహారంలో జరిగే కల్తీలను గుర్తించే విధానంపై ప్రజలకు, విద్యార్థులకు ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ మార్గదర్శకత్వంలో కళాశాల దత్తత గ్రామం బ్రాహ్మణపల్లెలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాలు, నెయ్యి, పసుపు, ఎండుమిర్చి కారం, ఉప్పు, మిర్యాలు, టీపొడి తదితర వాటిలో కల్తీని కనుగొనే పలు పద్ధతులను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.కీర్తిరెడ్డి, డాక్టర్ పి.జయమ్మ, జాకీర్‌బాష, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు గౌరవవేతనం అభినందనీయం

కడప రూరల్, సెప్టెంబరు 26 :జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10,000 గౌరవవేతనం ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్‌లోని టీడీపీ లీగల్ సెల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

ఇబ్బందుల్లో వసతిగృహ విద్యార్థులు



వేముల వసతి గృహంలో మరుగుదొడ్డి దుస్థితి

వేముల, సెప్టెంబరు 26: మండల కేంద్రమైన వేముల సాంఘిక సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో బయటకు వెళ్లాల్సిన దుస్థితి. ఉన్నతాధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు సంకల్పం బలంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్

సీకేదిన్నె, సెప్టెంబరు 26: విద్యార్థులకు సంకల్పం బలంగా ఉంటే ఎంతటి కార్యక్రమాన్ని అయినా సులభంగా పూర్తి చేయవచ్చునని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సినీ రచయిత, నిర్మాత, హీరో కె.ప్రదీప్ తెలిపారు. కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకునే జ్ఞానం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో, క్రమశిక్షణతో చదివి వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఏవో రామసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 26: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలలో వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో తనుశ్రీ, పార్వతి మొదటిస్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రతి చూపిన విద్యార్థులను, పీఈటీ సోమసుందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌లను అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు 'వివేకానంద' విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 26: వేంపల్లె స్వామి వివేకానంద హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయరెడ్డి తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికల రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు గండి గురుకుల పాఠశాల మైదానంలో జరిగాయన్నారు.అండర్-14 బాలబాలికల విభాగంలో హాసిని, ప్రమీల, రేవంత్ కుమార్‌రెడ్డి, మహమ్మద్ సాహిల్, అండర్-17 బాలికల విభాగంలో సాహిత్య, భాను ఎంపికైనట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన బాలబాలికలను, పీఈటీ పద్మజను అభినందించారు.

పోలీసు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), సెప్టెంబరు 26 : పోలీసు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఉమేశ్‌చంద్ర కల్యాణ మండపంలో మూడు రోజులుగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల్లోని మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.విధుల్లో నిమగ్నమై సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోలేని సిబ్బంది మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ము న్ముందు మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. క్యాంపు ఏర్పాటుకు సహకరించి మణిపాల్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడికి, రేడియేషనల్ అంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ దివ్య, రామ్‌చక్రవర్తి, సిబ్బందిని అభినందించారు. అలాగే ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, పోలీసు సంక్షేమ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మేరీసుజాత, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, మహిళా ఎస్ఐలు పావని, నస్రీన్, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మీదేవి, మాధవీలత, క్రిష్ణవేణిలలను కూడా ఎస్పీ అభినందించారు.

తమ్మిరెడ్డిని కలిసిన సుంకర శ్రీనివాస్



కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 26: మంగళగిరిలోని ఏపీ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ను గురువారం ఆయన నివాసంలో జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కో ఆర్డినేటరు, కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తమ్మిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివశంకర్ కడప పరిస్థితుల గు రించి అడిగి తెలుసుకున్నారు.

ట్రిపుల్‌ఐటీలో ఇరువురికి బాధ్యతలు అప్పగింత

వేంపల్లె, సెప్టెంబరు 26: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పనిచేస్తున్న ఇరువురికి బాధ్యతలు అప్పగించినట్లు డైరెక్టర్ కుమారస్వామిగుప్త తెలిపారు. ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గాపనిచేస్తున్న బి.వి.సుధాకర్‌రెడ్డిని ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా, మ్యాథ్స్ విభాగంలో మెంటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జె.దీప్తిని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా నియమించినట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం: కలెక్టర్



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, అధికారులు, సిబ్బంది

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 26: పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపాలని, కార్యాలయాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పలుగు, పారలు పట్టి తమ కార్యాలయాల వద్ద స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు పరిశుభ్రంగా దర్శనమిచ్చాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. డీపీఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, హౌసింగ్ పీడీ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు రాజేశకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యూనివర్శిటీ ఆవరణంలో పిచ్చిమొక్కలతో పాటు చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి శుభ్రం చేశారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

అభివృద్ధి పరుగులు పెట్టిస్తాం ● 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, భూపేష్ రెడ్డి ● ఇంటింటా కరపత్రాల పంపిణీ

పెద్దముడియం, సెప్టెంబరు 26: గ్రామాలను అభివృద్ధి చేయడం, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే కర్తవ్యమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి అన్నారు. భీమగుండం, బోడితిప్పలపల్లె గ్రామాల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పీడ విరగడైందని ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అన్ని సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. భీమగుండంలో రూ.40 లక్షలు వెచ్చించి మంచినీటి ట్యాంకు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. రూ.17లక్షలతో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభించారు. వంద రోజుల పాలనలో భాగంగా ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో రూ.4వేలు వృద్ధాప్య పింఛన్లు, ల్యాండ్ టైట్లింగ్‌యాక్ట్ రద్దు తదితర కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టారన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించడం, త్వరలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణాలు కల్పిస్తామన్నారు. భీమగుండం, నొస్సం, ఎ.కంబాలదిన్నె గ్రామాల తారురోడ్లకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. భీమగుండం పరిధిలో సోలార్ పవర్‌పాయింట్లు రాబోతున్నాయని తద్వారా సుమారు ప్రత్యక్షంగా పరోక్షంగా 1600 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఎస్‌ఆర్‌బీసీ కాల్వ గుండా త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కుందూ నుంచి భీమగుండం, భూతమాపురం గ్రామాలకు సంబంధించి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభం అవుతాయన్నారు. జమ్మలమడుగులో తరచూ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తమ్మీద ఈ వంద రోజులపాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ప్రజలకు వారు వివరించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కొండారెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణయ్య, తహసీల్దారు వెంకటసుబ్బయ్య, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఆయా గ్రామాల నేతలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బద్వేలు గాంధీనగర్‌లో....

బద్వేలు రూరల్, సెప్టెంబరు 26: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి సూచనతో గురువారం 21, 22 వార్డులు గాంధీనగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లి వంద రోజుల్లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను కరపత్రాలు అందించి ప్రజలకు వివరించారు. శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, పెద్ద పక్కీరయ్య, తుంగా నరసింహ, చిన్నపక్కీరయ్య, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో కరపత్రాల పంపిణీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26: పోరుమామిళ్లలోని 59వ పోలింగ్ బూత్ కన్వీనరు అన్వర్‌బాషా, అధికారులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్యవీధిలో మౌలాలి, రంతుల్లా తదితరులు కరపత్రాలను పంపిణీ చేశారు. పోరుమామిళ్ల సచివాలయ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, వీఆర్వో వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంటు సిద్దు, ఇంజనీరింగ్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లగొందిలో...

అట్లూరు, సెప్టెంబరు 26: తంబళ్లగొంది పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి రెడ్డప్పరెడ్డి కేవీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాతమ్మ, పంచాయతీ అధికారి శివప్రసాద్, ఏపీయం సురేశ్‌బాబు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

బి.కోడూరు, సెప్టెంబరు 26: ప్రతి గ్రామానికీ అధికారులు వెళ్లి ఎలాంటి సమస్యలున్నా వాటిని గుర్తించి పరిష్కరించాలని బద్వేలు నేత రితీష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గం నేత బొజ్జా రోశన్న సూచించారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం'లో ఆయన మాట్లాడుతూ మండల రైతాంగానికి బ్రహ్మంసాగర్ నుంచి త్వరలో సాగు, తాగునీరు అందిస్తామని, అన్నిచెరువులు పూర్తిగా నీటితో నింపుతామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, శేషారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బాలయ్య, మద్దిరెడ్డి, వేణుగోపాలరెడ్డి, రాఘవరెడ్డి, దుగ్గిరెడ్డి, జయరామిరెడ్డి, పవన్, నరసింహులు పాల్గొన్నారు.

ఖాజీపేటలో...

ఖాజీపేట, సెప్టెంబరు 26: వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరచిపోయిందని ఖాజీపేట ఎంపీటీసీ బి.చంద్రభాస్కర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఖాజీపేట, మిడుతూరు, తుడుమలదిన్నె పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఖాజీపేట వక్కిలేరు కాల్వను పునరుద్ధరించి రైతాంగానికి సాగునీరు, ఖాజీపేట ప్రజలకు తాగునీరు తీర్చిన వ్యక్తి ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ అన్నారు. ఖాజీపేట పంచాయతీలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు అనుమతి వచ్చాయన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సెక్రటరి రమణారెడ్డి, టీడీపీ నేతలు సిద్దారం కదీరుల్లా, కేకే బ్రదర్స్, జాఫర్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

దిరసవంచలో...

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 26: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అన్నారు. దిరసవంచ పంచాయతీలో నిర్వహించిన 'ఇదిమంచి ప్రభుత్వం'లో ఆయన మాట్లాడుతూ మఠాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, సర్పంచ్ రాళ్లపాటి అమీర్‌బాషా, వెలుగు ఏపీఎం ప్రకాశరావు, టీడీపీ నేతలు సుబ్బారెడ్డి, భాస్కర్, సుధాకర్, సాంబశివారెడ్డి, శివాయాదవ్, ముద్దు క్రిష్ణమనాయుడు, భగీరథ, వెంకటేశ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో...

ముద్దనూరు సెప్టెంబరు26: సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో ప్రజలకు ప్రభుత్వం పింఛన్ పెంపు వంటి పథకాలు అందించిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ వీఆర్‌ఓ సునీత, ఈశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







భీమగుండంలో నీటి ట్యాంకుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి - బద్వేలు గాంధీనగర్‌లో కరపత్రాలు పంచి ప్రజలకు వివరిస్తున్న మాచుపల్లె లక్ష్మీదేవి - బి.కోడూరు సభలో మాట్లాడుతున్న టీడీపీ నేత రితీష్‌కుమార్‌రెడ్డి

24 మద్యం బాటళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26: 24 మద్యంబాటళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద తిరుపాలమ్మ అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకుని రూ.3600 విలువైన మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మురుగు తొలగింపు



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 26: ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పర్యవేక్షణలో కాల్వల్లో మురుగు తొలగింపు పనులకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. గురువారం స్థానిక గోపీరైస్ మిల్ రోడ్డులోని కాల్వల్లో మురుగు తొలగింపులో వున్న అడ్డంకులను ఎలా అధిగమించాలో సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. పూడిక తీత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'దళితుల హక్కులు కాలరాసిన జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

బద్వేలు, సెప్టెంబర్ 26: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దళితుల హక్కులను కాలరాశారని దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురం రెడ్డన్న, ఏపీ దళిత గిరిజన జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త దుర్గా ప్రసాద్, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీఓ హోంలో దళిత హక్కులను సాధించేందుకు, సమస్యను పరిష్కరించేందుకు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల సమస్యలు పరిష్కరించేందుకు ఐక్యవేదిక పోరాడుతుందన్నారు. అగ్రకులాల నుంచి బడుగు, బలహీనవర్గాలపై దాడులు, అత్యాచారాలు వంటివి సమర్థంగా ఎదుర్కొనేందుకు దళిత వేదిక ముందుంటుందన్నారు. దళిత జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. బద్వేలు డివిజన్ కన్వీనర్‌గా పిచ్చయ్య, అధ్యక్షుడిగా ముత్యాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బాలస్వామిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ రాష్ట్ర నేత గురుమూర్తి పాల్గొన్నారు.

ఎస్టీయూ వైద్యసేవలు అందించడం హర్షణీయం



విద్యార్థులకు పరీక్షిస్తున్న డాక్టర్లు

జమ్మలమడుగు, సెప్టెంబరు 26: గూడెం చెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారి క్రిష్టప్ప తెలిపారు. వైద్య శిబిరంలో విద్యార్థులు, స్థానికులు వైద్య సేవలు పొందారు. డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యావిధానంలో నూతన సాంకేతిక విధానాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ విద్యార్థులకు మంచి విద్య, క్రమశిక్షణ అలవర్చాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్, ఉపాధ్యాయులు గురుకుమార్, దంతవైద్యులు భారతి, డాక్టర్ తేజ, దీపిక, విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్‌రావు, చౌడయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ యనమల సిద్ధార్థయాదవ్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. గురువారం వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో 'గంజాయి మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలన' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో భాగంగా యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడడంతో సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాలు పెరిగిపోయాయన్నారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బద్వేలు, సెప్టెంబరు 26: నియోజకవర్గం విద్యార్థినీ, విద్యార్థులు ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఆటల పోటీలు జరిగాయి. బాలికల విభాగం 100 మీటర్లు పరుగు పందెంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని జాస్మిన్ ప్రథమ స్థానం, జే.షహీన్ ద్వితీయ స్థానం, కలసపాడు కేజీబీవీ పాఠశాల విద్యార్థిని మోక్షిత తృతీయ స్థానంలో నిలిచినట్లు బాలుర హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ కన్వీనర్ బాలయ్య తెలిపారు. బాలుర విభాగం హైజంప్‌లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం పి. చైతన్య, ద్వితీయ స్థానంలో వెంకటాపురం పాఠశాల విద్యార్థి జైశ్యామ్, బి.కోడూరు, పోరుమామిళ్ల పాఠశాలల విద్యార్థులు విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, మహబూబ్ బాష, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

బద్వేలు, సెప్టెంబరు 26: వాతావరణ పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బిజివేముల వీరారెడ్డి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతో కూడిన వాతావరణాన్ని సృష్టించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రామలక్ష్మిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు దొరస్వామి నాయక్, ఈశ్వరయ్య, మహేష్ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ కళాశాల నోడల్ అధికారులు జి.రవీంద్రారెడ్డి, ఆర్. ప్రేమ్‌కుమార్, ఎస్.బాలయ్య, అధ్యాపకులు రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, సంటెయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26: చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నదే లక్ష్యమని రంగసముద్రం పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా రంగసముద్రం పంచాయతీ సహా మిగిలిన పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమాయత్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వర ప్రసాదరావు ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో చెత్త చెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగించారు.

తహసీల్దారుకు ఫిర్యాదు

చాపాడు, సెప్టెంబరు 26: నక్కలదిన్నె వద్ద ఉన్న సర్వే నంబర్లు 199, 182లలో ఉన్న 3.63 ఎకరాల గ్రామ కంఠం భూమిపై విచారించాలని తహసీల్దారు రవీంద్రారెడ్డికి గ్రామస్థులు వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, రాజశేఖర్, రామసుబ్బయ్య, నాగరాజు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని రవీంద్ర ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం 1977లో తమకు ఒక్కొక్కరికి ఆరు సెంట్ల చొప్పున 60 కుటుంబాలకు ఇండ్ల స్థలాల కోసం ఇచ్చినట్లు తెలిపారు. 1985లో గ్రామంలో జరిగిన ఓ అగ్నిప్రమాదంలో ఇళ్లపట్టాలు కాలిపోయినట్లు తెలిపారు. ఈ భూమిని తహసీల్దారు మళ్లీ వెనక్కు తీసుకుని తమకు పంపిణీ చేయాలని వారు కోరారు

జీఓ 56ను రద్దు చేయాలని కోరుతూ నిరసన



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నేతలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 26: స్థానిక పాత బస్టాండు గాంధీ విగ్రహం ఎదుట గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కొప్పర్తి మేఘా ఇండస్ట్రియల్ హబ్ అనుసంధానంగా మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ టెస్టింగ్ సెంటర్ అమరావతికి తరలించడం, జీఓ నెం.56 రద్దు చేసి ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్ తరలింపు మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, క్రిష్టారెడ్డి, పుష్పరాజ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

ముద్దనూరు సెప్టెంబరు26: ఎంపీడీఓగా గురువారం ముకుందారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గండి క్షేత్రం అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహించేవారు. బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడిచిట ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ మండల కార్యాలయం ఏఓగా బదిలీపై వీరపునాయుణపల్లెకు వెళ్లారు.

దివ్యాంగుల శిబిరం విజయవంతం

కొండాపురం, సెప్టెంబరు 26: దివ్యాంగుల శిబిరం విజయవంతమైంది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 76 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వీరిని పరిశీలించి అవసరమైన వారికి కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, మోటర్ సైకిల్లు రెండు నెలల్లోపు అందజేస్తామని సూపరింటెండెంట్ అనిల్ తెలిపారు. శిబిరంలో ఎంపీడీఓ నాగప్రసాద్, ఎంఈఓలు ఓబులేసు, రామయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, ఐఈఆర్టీ సిబ్బంది రాంబాబు,తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

150 మంది పేర్లు నమోదు

చాపాడు, సెప్టెంబరు 26: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరంలో 150 మంది వికలాంగుల పేర్లను నమోదు చేసుకున్నట్లు ఎంఈఓ వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పిల్లలు, పెద్దలు శిబిరానికి హజరయ్యారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ముద్దనూరు సెప్టెంబరు26: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ మాధవరెడ్డి తెలిపారు. హైజంప్ అండర్-14 బాలుర విభాగంలో ప్రథమస్థానంలో తేజ, తృతీయ స్థానంలో గోపిచంద్, లాంగ్ జంప్ 600 మీటర్ల ద్వితీయ స్థానంలో పునీత్, అండర్ -17 బాలుర విభాగం లాంగ్ జంప్‌లో వెంకట తేజ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

నంద్యాల సీటీఓగా సుజిత



కొండాపురం, సెప్టెంబరు 26: నంద్యాల-2 కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా కొండాపురం వాసి బోడేల సుజిత బాధ్యతలు చేపట్టారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈమె మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో ఉత్తీర్ణత సాధించింది. ఏడాదిగా ట్రైనింగ్‌లో ఉన్న ఈమె గురువారం బాధ్యతలు చేపట్టినట్లు ఆమె తండ్రి బోడేల ఈశ్వరరెడ్డి తెలిపారు. కొండాపురం యువతి గ్రూప్-1 ఆఫీసర్‌గా నియామకం కావడంతో ఈమె తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

చాపాడు, సెప్టెంబరు 26: సీఎం నారా చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, వరప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 105 మంది ఉపాధ్యాయులతో సంఘ సభ్యత్వ నమోదు చేసినట్లు తెలిపారు. శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో తమకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. అందువలన 12వ పీఆర్‌సీలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. బకాయిలు నగదు రూపంలో చెల్లించాలన్నారు.

ఒత్తిడిని అధిగమించేందుకు యోగా

కాశినాయన సెప్టెంబరు26: నిజ జీవితంలో ఒత్తిడిని తగ్గించుకుని ఏకాగ్రతను పెంపొందించుటకు యోగా ఎంతో దోహదపడుతుందని ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ టీచర్ బి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. వరికుంట్ల కస్తూర్బా బాలికల పాఠశాల, నర్సాపురం మోడల్ స్కూళ్లల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన మూడురోజుల మేధా, యోగా శిక్షణా తరగతులు గురువారంతో ముగిశామన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ఒత్తిడిని ఎలా జయించాలో తెలియజేస్తూ రవిశంకర్ గురూజీ అందించిన సుదర్శన క్రియను విద్యార్థులకు నేర్పించారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ బెంగుళూరు నుంచి చలపాక సాయికిరణ్, పి.వంశీ, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా పండుగకు ఎమ్మెల్యేకి ఆహ్వానం



మైదుకూరు రూరల్, సెప్టెంబరు 26: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ గుప్త ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు.

ఔషధ మొక్కలపై పోటీ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యావాహిని కాంపిటీషన్‌లో భాగంగా సీనియర్ విద్యార్థులకు వంట గదిలో ఔషధ మొక్కలు, జూనియర్లకు చుట్టుపక్కల దొరికే ఔషధ మొక్కలు ప్రాజెక్టు వర్క్ పోటీ నిర్వహించారు. కల్లూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం సురేష్‌బాబు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసిన 13 మంది విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ కన్వీనర్ వీరనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: లలితాదేవి రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ట్రస్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ 3న రాజరాజేశ్వరీదేవి అలంకారం, 4న భవానీదేవి, 5న శారదాదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న శ్రీదేవి వనవిహారిని, పార్వతీదేవి, 8న ధనలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న మహిషాసురమర్దిని, 11న లక్ష్మీవేంకటేశ్వరస్వామి, 12న విజయలలితాదేవి అలంకారం నిర్వహిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీలు అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు ఉత్సాహంగా సాగాయి. గురువారం జార్జి కారోనేషన్ క్లబ్‌లో నిర్వహించిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, క్లబ్ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, జాయింట్ సెక్రటరి ఈశ్వర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, శివారెడ్డి, అల్లాబకాష్ పర్యవేక్షించారు..

కొరవడుతున్న నిఘా

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 26: మైదుకూరులో రోజు రోజుకూ దొంగతనాలు ఎక్కువైపోతున్నాయి. అభద్రతాభావంలో ప్రజలు బిక్కుబిక్కు మంటూ బతుకుతున్న వైనం. గత నెలలో ఓ ఫైవుడ్ షాపు, మెడికల్ షాపుల్లో దొంగలు హల్‌చల్ చేశారు. నిన్న మిట్టా జ్యువెలర్స్‌లో భారీ చోరీ, నేడు మున్సిపాలిటీ పరిధి రాయప్పగారిపల్లెలో దొంగతనానికి వెళ్లిన దొంగలు, ఇంట్లో చప్పుడు కావడంతో పారిపోయారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

